www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం

ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 32 | పేజీలు : 04 | ఆదివారం 22 - 11 - 2026 | వెల : 01/-

అక్షర మేధస్సు
నిజం... నిర్భయంగా... ప్రజల కోసం...
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'అక్షర మేధస్సు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

అనుభవజ్ఞులైన జర్నలిస్టుల సాధ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో

1. జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
2. జిల్లా ఫోటో గ్రాఫర్స్
3. ఆర్. సీ ఇన్చార్జులు
4. మండల రిపోర్టర్స్
5. క్రైమ్ రిపోర్టర్స్

అనుభవజ్ఞులకు ప్రాధాన్యం అలాగే నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించబడును.

సంప్రదించాల్సిన నెంబర్ 8466071258. 9989505078

సమాజ ధ్వని... మీ కలం ద్వారా...

ప్రతి కుటుంబానికి ఒకరికే ఇందిరమ్మ జీవిత బీమా

- వయోపరిమితి 18--59 ఏళ్లు
- 18 నుంచి 59 ఏళ్లలోపు వారికే అర్హత
- 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు అర్హులు
- ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ ఆధారంగా వయస్సు నిర్ధారణ
- పుట్టిన సంవత్సరం మాత్రమే ఉంటే జూలై 1వ తేదీని ప్రామాణికంగా తీసుకోనున్న అధికారులు
- బీమా కవరేజీ ప్రారంభమైన తేదీ నుంచి ఏడాది పాటు జీవిత బీమా రక్షణ



హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి సంబంధించి అధికారులు తాజాగా కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. కుటుంబాలకు జీవిత బీమా రక్షణ కల్పించే ఈ పథకంలో ఎవరు అర్హులు? వయోపరిమితి ఎంత? దరఖాస్తుకు ఏ నిబంధనలు వర్తిస్తాయి? అనే వివరాలను స్పష్టం చేశారు.ఇందిరమ్మ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే నమోదు చేసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా కుటుంబ పెద్దకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దరఖాస్తుదారుల వయస్సు తప్పనిసరిగా 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి.అధికారులు వెల్లడించిన మార్గదర్శకాల ప్రకారం.. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు ఈ పథకానికి అర్హులుగా పేర్కొన్నారు. కాబట్టి దరఖాస్తు చేసుకునే ముందు తమ వయస్సు నిర్దేశిత పరిమితిలో ఉందో లేదో పరిశీలించుకోవాలి.లబ్ధిదారుల వయస్సును నిర్ధారించేందుకు ప్రభుత్వం ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోనుంది. ఒకవేళ ఆధార్ కార్డులో పూర్తి పుట్టిన తేదీ లేకుండా కేవలం - మిగతా 2 లో



కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

- హుజురాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శ
- ఒక్క కొత్త పింఛను మంజూరు చేసినట్లు తేలితే రాజీనామా చేస్తానని సవాల్
- నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ

హైదరాబాద్ :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త - మిగతా 2 లో

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు



- రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందంటూ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య
- ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి
- పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్ :

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి సొంత పార్టీపై చేసిన - మిగతా 2 లో

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం

- అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
- భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
- భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
- రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక



ఢిల్లీ :

భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. - మిగతా 2 లో

గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు



- సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను
- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
- ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి

ఢిల్లీ :

సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం - మిగతా 2 లో



అమెరికా - చైనా మధ్య ముదురుతున్న చిప్ వార్!

- ఐదు దేశాలకు ఏఐ చిప్‌ల ఎగుమతులపై అమెరికా ఆంక్షలు కఠినతరం
- మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, సింగపూర్, బ్రెజిల్‌పై కొత్త నిబంధనలు
- విదేశీ డేటా సెంటర్ల ద్వారా చైనా కంపెనీలకు చిప్‌ల సరఫరాపై అమెరికా ఆందోళన
- ఎన్విడియాపై పెరుగుతున్న నియంత్రణ ఒత్తిడి.. 11.5 శాతం పడిపోయిన షేర్లు

అమరావతి :

అమెరికా, చైనాల మధ్య చిప్ వార్ మొదలైంది. ఇటీవల ఎన్విడియా కంపెనీకి చెందిన ఏఐ చిప్స్ అక్రమ మార్గాల ద్వారా చైనాకు ఎగుమతి - మిగతా 2 లో

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి



- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి
- సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి

అమరావతి :

కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం - మిగతా 2 లో

మూడు రోజులు బ్యాంకులు బంద్

- నవంబర్ చివరి వారంలో బ్యాంకులకు పలు సెలవులు
- గురునానక్ జయంతి సందర్భంగా పలు నగరాల్లో బ్యాంకులు బంద్
- హైదరాబాద్‌లోనూ మంగళవారం బ్యాంకులకు సెలవు
- నవంబర్ 28న నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా సెలవు
- సెలవు రోజుల్లో ఆన్‌లైన్, ఏటీఎం సేవలు యథాతథం



ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే
- కార్యకర్తే అధినేత, పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు
- స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు
- ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే
- మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్



అమరావతి :

స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించిన ప్రజలందరికీ సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పరిషత్ ఎన్నికల్లో ప్రజలు అద్భుత ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల పాలనకు ప్రజలిచ్చిన తీర్పుగా దీనిని భావిస్తున్నామన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.కార్యకర్తే అధినేత, వారే పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈసారి అభ్యర్థులకు టికెట్లు కేటాయించామని తెలిపారు. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొత్తవారికి అవకాశమిచ్చామని చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో విద్యార్హతలు, ప్రవర్తన, పార్టీ పట్ల అంకితభావం, విధేయతకు ప్రాధాన్యమిచ్చామన్నారు.బీసీలు మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీకి - మిగతా 2 లో

డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీశైలం రిజర్వాయర్

- తాగునీటికే ప్రాధాన్యమిస్తున్న ఏపీ
- శ్రీశైలం జలాశయంలో డెడ్ స్టోరేజీకి చేరువగా పడిపోయిన నీటి నిల్వలు
- వర్షాభావ పరిస్థితులతో రాయలసీమలో ఎండిపోతున్న పంటలు
- శ్రీశైలం మిగులు జలాలను తాగునీటికే పరిమితం చేయాలని ఏపీ నిర్ణయం
- హంద్రీ-నీవా ద్వారా ఒక్క తడికైనా నీరివ్వాలని కోరుతున్న రైతులు
- కృష్ణా డెల్టా కోసం నాగార్జున సాగర్ నుంచి 11 టీఎంసీలు కోరిన ఏపీ



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో ఒకవైపు కోస్తా జిల్లాలను తుపాన్లు అతలాకుతలం చేస్తుంటే, మరోవైపు రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకోగా, శ్రీశైలం - మిగతా 2 లో

సంపాదకీయం

మనీలా సందేశం



రెండేళ్ళ తరువాత క్వాడ్ సమావేశం జరగడమే ఓ విశేషమైతే, దీనికితోడు, అమెరికా అధ్యక్షుడే స్వయంగా హాజరైనారు కనుక, మీడియాకు అది గొప్ప వేడుక అయింది. క్వాడ్ సభ్యదేశం కాని ఫిలిప్పీన్స్‌లో ఈ సదస్సు జరగడం మరో విశేషం. రాజధాని మనీలాలో 'ఆసియాన్' సభ్యత్వ దేశాల నేతలంతా 'కలసికట్టుగా మన భవితను నిర్దేశించుకుందాం' అంటూ ప్రాంతీయ శాంతి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, భద్రత ఇత్యాది అంశాలమీద చర్చలు చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ 23వ భారత్--ఆసియాన్ సదస్సులో పాల్గొని మిగతా దేశాలతో వాణిజ్యం, దీర్ఘకాలిక సంబంధాల మీద మాట్లాడారు. 'ఆసియాన్' ఆఖర్లో మనీలా వచ్చిన అమెరికా అధ్యక్షుడు, మరికొందరు నేతలు ఎలాగూ ఎపెక్ సదస్సుకోసం చైనా వెళ్ళవలసి ఉన్నది కనుక 'క్వాడ్' కూడా ఇక్కడే జరిగిందని చెబుతున్నారు. అయితే, ప్రయాణసౌలభ్యం కాక, మనీలాలో కొన్ని హెచ్చరికల తరువాతే చైనాలో అడుగుపెట్టాలని ట్రంప్ నిర్ణయించుకోవడంతో క్వాడ్ సదస్సు ఏర్పాటు కాస్తంత హడావుడిగా జరిగిందని కొందరు అంటారు.దాదాపు దశాబ్దంపాటు నిద్రావస్థలో ఉన్న క్వాడ్‌ను 2017 నవంబరులో మనీలాలో జరిగిన ఆసియాన్ సదస్సు సందర్భంగానే ఈ నాలుగు దేశాలు పునరుద్ధరించాయి. మళ్ళీ తొమ్మిదేళ్ళకు అక్కడే అత్యున్నతస్థాయి నాయకుల సదస్సు జరగడం నిజానికి విశేషమే. ఆసియాన్ దేశాలను క్వాడ్ పట్టించుకోవడం లేదన్న విమర్శలను తిప్పికొట్టడానికి కూడా పక్కపక్కనే రెండు సదస్సులు జరగడం ఉపకరిస్తుంది. సముద్రంలో చైనా వీరంగాలను ఫిలిప్పీన్స్ నేరుగా భరిస్తోంది కనుక, క్వాడ్ భాగస్వామి కాకున్నా అక్కడ ఈ సదస్సు జరిపి, ఫిలిప్పీన్స్ సార్వభౌమత్వ పరిరక్షణకు తామంతా కట్టుబడివున్నామని, ఇండో--పసిఫిక్ ప్రాంతంలో అంతర్జాతీయ సముద్రజలాల్లో చైనా దూకుడును ఎంతమాత్రం ఉపేక్షించబోమని క్వాడ్ చాటిచెప్పింది. చైనాతో సయోధ్యకు అమెరికా తహతహలాడుతున్నది కనుక, ఆ సాన్నిహిత్యంమీద క్వాడ్ భవిష్యత్తు ఆధారపడి వుంటుందన్నది నిజం. చైనా, రష్యా అధినేతలతో అత్యున్నత స్థాయి భేటీకి ముందు ట్రంప్ మనీలాలో క్వాడ్ మీద ఎంతో అభిమానాన్ని ప్రకటించారు. క్వాడ్ పుట్టుకే చైనా లక్ష్యంగా జరిగింది కనుక, శత్రువుతో బేరాలు ఆడుకోవడానికి ఈ వేదికను వాడుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. పైగా, మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తిన్న ఆయనకు ప్రపంచపటంమీద తాను చక్రం తిప్పుతున్నానని చెప్పుకోవచ్చు. మలివిడత అధికారంలోకి వచ్చిన తరువాత చైనాతో అవసరాల రీత్యా క్వాడ్ మీద ట్రంప్ అంతగా దృష్టిపెట్టలేదు కానీ, 2007లో పుట్టి, ఆ తరువాత జపాన్, ఆస్ట్రేలియా రాజకీయ పరిణామాల కారణంగా నిస్తేజంగా మారిన క్వాడ్‌ను 2017లో పునరుద్ధరించింది ఆయనే. అన్ని రంగాల్లోనూ అన్ని విధాలా ఎదిగిపోతున్న చైనాకు సంకెళ్ళ వేయడానికి ఏర్పడినప్పటికీ, దానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడటం కంటే, పరోక్షంగా చురకలంటించడానికే క్వాడ్ పరిమితమైంది.సముద్ర నిఘావ్యవస్థ, ఉమ్మడి సైనికవిన్యాసాలు, కేబుల్ కనెక్టివిటీ, సైబర్ సెక్యూరిటీ భాగస్వామ్యం ఇత్యాది అనేక సరికొత్త ఆశయాలు క్వాడ్ దేశాధినేతలు ప్రకటించారు. ఈ ప్రాంతంలో చైనా దూకుడును, దాని ఏకపక్ష ఎగుమతి ఆంక్షలను పరోక్షంగా విమర్శిస్తూ, సురక్షితమైన రవాణా కారిడార్ల కోసం కలిసి పనిచేయాలని, కీలకమైన సరఫరా వ్యవస్థలను సురక్షితంగా మార్చుకోవాలని క్వాడ్ సంకల్పించింది. కృత్రిమ మేధకు సూపర్ ఇంటలిజెన్స్ అని ఇటీవలే నామకరణం చేసిన ట్రంప్ దానిలో పెట్టుబడులు, విస్తరణతో క్వాడ్ బలోపేతం కాబోతోందన్నారు. పారిశ్రామిక విప్లవం కంటే గొప్ప మార్పును ఏఐ తెస్తుందని, క్వాడ్ సభ్యదేశాలన్నీ దానితో ప్రయోజనం పొందుతాయని, భద్రతభయాలకు ఇక తావులేదన్నారు. వచ్చే ఏడాది క్వాడ్ దేశాల వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహించి, వాణిజ్యసంబంధాలను మరింత బలోపేతం చేయబోతున్నట్టు, అలాగే, విస్తృతస్థాయిలో ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించబోతున్నట్టు ప్రకటించారు. మరిన్ని కొత్త నిర్ణయాలు కూడా అప్పుడు జరుగుతాయట. క్వాడ్ శిఖరాగ్ర సమావేశం ఉమ్మడి ప్రకటన కూడా దాని భవిష్యత్ సహకారం, చైనామీద ఏమాత్రం ఆధారపడే అవసరంలేని వ్యవస్థల ఏర్పాటు విషయంలోనూ ఎంతో నమ్మకాన్ని పెంచేట్టుగానే ఉంది. అయితే, చైనా అధ్యక్షుడిని ఆలింగనం చేసుకోవడానికి వెడుతూ మధ్యలో మనీలాలో కాలూనిన అమెరికా అధ్యక్షుడు రేపటిరోజుల్లోనూ క్వాడ్ పట్ల ఇంతే పట్టుదలగా ఉంటారా?

డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీశైలం రిజర్వాయర్

మొదటిపేజీ తరువాయి - ప్రాజెక్టులో నీటిమట్టం అడుగంటడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఎగువ కృష్ణా పరీవాహక ప్రాంతం నుంచి వరద రాక తగ్గడంతో, శ్రీశైలంలో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగించడంతో శ్రీశైలంలో నిల్వలు వేగంగా పడిపోయాయి. నవంబర్ 20 నాటికి మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీశైలంలో కేవలం 46.82 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. మరో 8 టీఎంసీలు తగ్గితే జలాశయం 38 టీఎంసీల డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోతుంది. డిసెంబర్‌లోనూ నీటి వినియోగం కొనసాగితే వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.రాయలసీమలో వర్షాభావంతో మొక్కజొన్న తదితర పంటలు ఎండుతుండటంతో, హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా కనీసం ఒక్క తడికైనా నీరు ఇచ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.మరోవైపు కృష్ణా డెల్టా సాగునీటి అవసరాలు కూడా ఇంకా తీరలేదు. 312 టీఎంసీల సామర్థ్యం గల నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం 177.47 టీఎంసీల నీరు ఉంది. దీంతో డెల్టా అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు 11 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీ జలవనరుల శాఖ ఇండెంట్ ఇచ్చింది. నవంబర్ 23న జరిగే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ నీటి విడుదలను ప్రధాన ఎజెండాగా చేర్చాలని ఏపీ బోర్డుకు లేఖ రాసింది. తాగునీటి కోసం శ్రీశైలాన్ని రక్షించుకుంటూనే, డెల్టా అవసరాలకు సాగర్ నీటిని వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

మొదటిపేజీ తరువాయి - వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ప్రతి కుటుంబానికి ఒకరికే ఇందిరమ్మ జీవిత బీమా



మొదటిపేజీ తరువాయి - పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉంటే, అటువంటి వారి పుట్టిన తేదీని అదే ఏడాది జూలై 1గా పరిగణించి అర్హతను నిర్ణయిస్తారు.ఈ పథకంలో నమోదు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు బీమా కవరేజీ ప్రారంభమైన తేదీ నుంచి ఏడాది పాటు జీవిత బీమా రక్షణ అందుబాటులో ఉంటుంది. అంటే బీమా ప్రారంభ తేదీ నుంచి పూర్తి 12 నెలల పాటు ఈ రక్షణ వర్తిస్తుంది.పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అర్హత కలిగిన కుటుంబాలు వయోపరిమితి, ఆధార్ వివరాలు, ఇతర మార్గదర్శకాలను పరిశీలించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది

మొదటిపేజీ తరువాయి - అందగా నిలిచారని గుర్తుచేశారు. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా వెన్నంటే ఉన్నారని కొనియాడారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించామని చెప్పారు. పల్నాడులో జడ్పీ ఛైర్మన్ అభ్యర్థి ఎంపికలోనూ సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో జనరల్ స్థానమైనప్పటికీ ఎస్సీ మహిళకు అవకాశం ఇచ్చి జడ్పీ ఛైర్మన్ పదవి కట్టబెట్టామని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కోట పుల్లమ్మ ఎంటెక్ చదివారని చంద్రబాబు వెల్లడించారు.'ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే. స్థానిక సంస్థల్లో ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తే, పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో 3.6 శాతం ఓట్లు పెరిగాయి. గొడ్డలి పార్టీ 39.8 నుంచి 6 శాతానికిపైగా ఓట్లు కోల్పోయింది. కూటమి అభ్యర్థుల సీట్ల సర్దుబాటుపై చాలా శ్రద్ధ పెట్టాం. అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశాం. ఎన్నికల కోసం ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేశాం.జిల్లా పరిషత్ పీఠాలపై మహిళలు, విద్యాధికులు, సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. 22 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకు కేటాయించామని తెలిపారు. వీరిలో 14 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారని వెల్లడించారు. 20 జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు అవకాశం ఇచ్చామన్నారు. వైస్ ఛైర్‌పర్సన్లలో 17 మంది ఉన్నత విద్యావంతులని వివరించారు. సామాన్య కార్యకర్తలను జడ్పీ ఛైర్‌పర్సన్లుగా నియమించామని తెలిపారు. అత్యుత్తమ యువ నాయకత్వం రావాలంటే విద్యాధికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు.బూత్ కమిటీలు, క్లస్టర్లు, జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, సీనియర్ నేతలతో చర్చించిన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై ప్రతిపాదనలు చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇన్‌ఛార్జులు, నలుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. మిత్రపక్షాలతో సమన్వయం కోసం ఈ కమిటీలు పనిచేశాయని తెలిపారు.స్థానిక ఎన్నికల ఫలితాలు కొందరు ఎమ్మెల్యేలకు మేలుకొలుపు కావాలని చంద్రబాబు హెచ్చరించారు. ప్రతీ ఫలితాన్ని క్షుణ్ణంగా విశ్లేషించి అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. పంచాయతీఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే పురపాలిక, పరిషత్ ఎన్నికల్లో కూటమికి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వైఎస్సార్సీపీ పరిస్థితి మరింతగా దిగజారుతోందని చెప్పారు. ఈ విజయాలను రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.వైఎస్సార్సీపీ పన్నిన కుట్రలను ఛేదించి, ఆ పార్టీ డ్రామాలను నమ్మకుండా తీర్పునిచ్చిన ప్రజలకు చంద్రబాబు హ్యాట్సాఫ్ చెప్పారు. స్థానిక ఎన్నికల వేళ గొడ్డలి పార్టీ ఎన్నో విన్యాసాలు చేసిందని ధ్వజమెత్తారు. హింసకు పాల్పడింది వాళ్లే, ఫిర్యాదులు చేసింది వాళ్లేనని విమర్శించారు. ఈ నాటకాలను ప్రజలు విశ్వసించలేదని అందుకే వైఎస్సార్సీపీ ఆటలు సాగలేదని స్పష్టం చేశారు. అంతిమంగా స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీకి ప్రజల మద్దతు దక్కలేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే శక్తిని ప్రజలు ఇచ్చారని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో తమపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఇప్పుడు మూడు స్థాయిల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కారుగా మారిందని అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.పీసీపీ అధ్యక్షురాలు షర్మిల కుమార్తె వివాహానికి తనను ఆహ్వానిస్తే దాన్నీ రాజకీయం చేస్తున్న వారిని ఏం అనాలని చంద్రబాబు ప్రశ్నించారు. రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదా అని నిలదీశారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు షర్మిలతోపాటు జగన్ పెళ్లికి కూడా తనను ఆహ్వానించారని, తానూ వెళ్లినట్లు గుర్తుందని చంద్రబాబు చెప్పారు. అలాంటిది షర్మిల కుమార్తె పెళ్లికి ఆహ్వానిస్తే అందులో ఏం రాజకీయం కనిపించిందన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నా మానవ సంబంధాలను గౌరవించాలన్న కనీస బాధ్యత లేదా? అంటూ జగన్ మీడియా తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం

మొదటిపేజీ తరువాయి - సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది.గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే-10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్తులో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ-ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది.మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

మొదటిపేజీ తరువాయి - ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు.ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు.ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు.అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు.సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు



అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి - వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు."కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే

అమెరికా - చైనా మధ్య ముదురుతున్న చిప్ వార్!



మొదటిపేజీ తరువాయి - అయ్యాయనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చైనా కంపెనీలు విదేశీ డేటా సెంటర్ల ద్వారా అమెరికా అధునాతన ఏఐ చిప్‌లను పొందకుండా అడ్డుకునేందుకు అమెరికా కొత్త ఆంక్షల్ని విధించింది. ఇందులో భాగంగా మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, సింగపూర్, బ్రెజిల్ దేశాలకు పంపించే ఏఐ చిప్‌లపై ఎగుమతి లైసెన్సింగ్ నిబంధనల్ని మరింత కఠినతరం చేసింది.అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఎన్విడియాపై దర్యాప్తు జరుపుతుందనే వార్తల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో ఇప్పటికే నియంత్రణపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఎన్విడియాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ వార్తల నేపథ్యంలో నవంబర్ 20న ఎన్విడియా షేర్లు 11.5 శాతం పడిపోయాయి. తాజా ఆంక్షల తర్వాత ఆగ్నేయాసియాలో ఏఐ మౌలిక సదుపాయాల పెట్టుబడులకు ఇబ్బందులు తలెత్తవచ్చు. ఇదే సమయంలో సెమికండక్టర్ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు వేగం కావచ్చని నవంబర్ 19న జెఫరీస్ విడుదల చేసిన 'గ్రీడ్ అండ్ ఫియర్' నివేదిక వెల్లడించింది.అమెరికా ఇప్పటికే చైనా కంపెనీలకు అధునాతన ఏఐ చిప్‌లను నేరుగా కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. అయితే, విదేశీ డేటా సెంటర్లు, క్లౌడ్ సర్వీస్ ద్వారా చైనా సంస్థలు కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పొందుతున్నాయనే ఆందోళన ఉంది. 2024లో నిషేధం అమలైనప్పటి నుంచి సుమారు 2,40,000 ఎన్విడియా చిప్‌లు చైనాకు అక్రమ రవాణా జరిగి ఉండొచ్చని జెఫరీస్ అంచనా వేసింది. సింగపూర్‌కు చెందిన మెగా స్పీడ్ సంస్థ, అలీబాబా సహా ఇతర చైనా కస్టమర్లకు సుమారు 86,000 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను లీజుకు ఇస్తోందని ఈ నివేదిక ప్రస్తావించింది.అమెరికా టెక్నాలజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి చైనా తన దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమను బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. చిప్ డిజైన్, తయారీ, పరికరాలు, ముడి పదార్థాల రంగాల్లో స్వదేశీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటోంది.

మూడు రోజులు బ్యాంకులు బంద్



మొదటిపేజీ తరువాయి - బ్యాంకు ఖాతాదారులకు ముఖ్య గమనిక. వచ్చే వారం (నవంబర్ 22 నుంచి 28 వరకు) బ్యాంకులకు పలు సెలవులు ఉన్నాయి. ముఖ్యమైన పనుల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకునే వారు ఈ సెలవుల జాబితాను ముందుగా చూసుకోవడం మంచిది. లేదంటే అనవసరంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గురునానక్ జయంతి, నాలుగో శనివారం వంటి కారణాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి.

సెలవుల వివరాలు:

నవంబర్ 23 (సోమవారం): సెంగ్ కుట్ స్నెమ్ సందర్భంగా కేవలం షిల్లాంగ్‌లో మాత్రమే బ్యాంకులకు సెలవు ప్రకటించారు.

నవంబర్ 24 (మంగళవారం): గురునానక్ జయంతి, కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, భోపాల్, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో బ్యాంకులు పనిచేయవు.

నవంబర్ 27 (శుక్రవారం):కనకదాస జయంతి సందర్భంగా బెంగళూరులో బ్యాంకులకు సెలవు. ఇక నవంబర్ 28వ తేదీ నెలలో నాలుగో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవు ఉంటుంది.బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ, ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను యథావిధిగా వినియోగించుకోవచ్చు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, నవంబర్ 21 అక్షర మేధస్సు: ధర్మవరం డివిజన్ పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగస్తులు ఈనెల 22న మరియు 23న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఉద్యోగస్తులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం సంబంధిత ఎంపీడీవో కార్యాలయాలలో అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోస్టల్ బ్యాలెట్ ను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల ద్వారా పొంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.

మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్‌కు జలకళ.. పెద్దవడుగూరు రైతుల్లో ఆనందం

ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ప్రత్యేక చొరవతో సాగునీటి విడుదల..

రైతులకు కొంత ఊరట

పెద్దవడుగూరు, నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ వర్షాలు లేక సాగునీటి కోసం ఎదురుచూస్తున్న పెద్దవడుగూరు మండల రైతులకు తీపికబురు అందింది. మండల రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్‌కు నీటిని విడుదల చేయించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి చొరవతో ఈ నీటి విడుదల సాధ్యమైంది. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా పెద్దవడుగూరు మండలంలోని రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్ ద్వారా నీరు అందితేనే పంటలకు జీవం పోసినట్లవుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతుల కష్టాలను గుర్తించిన తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. పెద్దవడుగూరు మండలానికి సాగునీటి అవసరాలను వివరించి, జిల్లా కలెక్టర్‌తో పాటు హెచ్ఎల్‌సీ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. మండలానికి నీటిని విడుదల చేయాల్సిన ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్‌కు నీరు విడుదలయ్యేలా చర్యలు చేపట్టారు.



రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా చొరవ

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న పెద్దవడుగూరు మండలంలో సాగునీటి ప్రాధాన్యత ఎంతో ఉంది. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో కాలువకు నీటి విడుదల కావడం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించే అంశంగా మారింది. సాగులో ఉన్న పంటలకు అవసరమైన సమయంలో నీరు అందితే పంటలను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కాలువ నీటి ద్వారా వ్యవసాయానికి కొంతమేర భరోసా లభిస్తుందని ఆశిస్తున్నారు. నీటి విడుదలతో మండలంలోని రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

కష్టకాలంలో రైతులకు అండగా నిలవడం అభినందనీయం

రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీటి విడుదలకు కృషి చేయడం పట్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను గుర్తించి జిల్లా కలెక్టర్, హెచ్ఎల్‌సీ అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్ ద్వారా నీరు నిరంతరాయంగా, చివరి ఆయకట్టు వరకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గవర్నర్ రాక వేళ

గట్టి బందోబస్తు ఏర్పాటు.

అడిషనల్ ఎస్పీ అంకిత సురానా.

గవర్నర్ రాక కోసం విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

పుట్టపర్తి, నవంబర్ 21 అక్షర మేధస్సు శ్రీ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ ఈరోజు పుట్టపర్తి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. పుట్టపర్తి డీఎస్పీ మాణిక్యరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యువరాజుతో కలిసి గవర్నర్ కాన్వాయ్ రాకపోకలు, ప్రయాణ మార్గాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ పర్యటన సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.



ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు నిర్వహించాలి: సీఎం చంద్రబాబు

ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు.

గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు



ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాలకు 10 కోట్ల మంది భక్తులు వస్తారన్న అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. జూన్ 26 నుంచి పుష్కరాలు : పుష్కరాల నిర్వహణకు రూ.3,723 కోట్లకు పైగా వ్యయంతో 22 శాఖల పరిధిలో 4,862 పనులను ప్రతిపాదించారు. ఇప్పటివరకు రూ.2,051 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. జూన్ 26 నుంచి జులై 7 వరకు జరిగే పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా :

ఇప్పటికే రూ.649 కోట్ల విలువైన 659 పనులు ప్రారంభమయ్యాయి. పారిశుద్ధ్యం , తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్ల కోసం మరో రూ.464 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులు అభివృద్ధి చేయనున్నారు. 268 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. భక్తుల రవాణా కోసం 4 వేల ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించారు. 1,560 ప్రత్యేక రైళ్ల నిర్వహణకు రైల్వేశాఖ ఏర్పాట్లు చేస్తోంది

135 భాషల్లో సేవలందించే ఏఐ చాట్‌బాట్ :

పుష్కరాల పర్యవేక్షణకు ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. 135 భాషల్లో సేవలందించే ఏఐ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయనున్నారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ప్రారంభించాలని సీఎం ఆదేశించారు.

వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు :

రాజమహేంద్రవరం నుంచి పోలవరం వరకు 40 కిలోమీటర్ల జలమార్గంలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లు ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, గోదావరి జలాల నాణ్యత కాపాడటంపై దృష్టి పెట్టనున్నారు. గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శన, దీపాలంకరణ, యోగా వంటి ప్రత్యేక కార్యక్రమాలతో పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లా కోర్టును సందర్శించిన బసవ రామ తారకం లా కళాశాల విద్యార్థులు

న్యాయస్థానం పనితీరు, విధివిధానాలపై ప్రత్యక్ష అవగాహన

న్యాయ వ్యవస్థ విలువలు, కోర్టు విశిష్టతను తెలుసుకున్న న్యాయ విద్యార్థులు





కడప నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి కడపలోని శ్రీమతి బసవ రామ తారకం మెమోరియల్ లా కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం న్యాయ విద్యార్థులు శుక్రవారం కడప జిల్లా కోర్టును సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జహీరుద్దీన్ పర్యవేక్షణలో ఈ సందర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు జిల్లా కోర్టులోని వివిధ విభాగాలను పరిశీలించి, న్యాయస్థానం పనితీరు, న్యాయ విచారణ ప్రక్రియ, కోర్టు విధివిధానాల గురించి అవగాహన పొందారు. న్యాయస్థానం యొక్క విశిష్టత, న్యాయ వ్యవస్థలో దాని ప్రాధాన్యత, న్యాయ విలువలు, న్యాయవాదుల బాధ్యతలు వంటి అంశాలను తెలుసుకున్నారు. న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఈ సందర్శన ద్వారా లభించింది. న్యాయస్థానాల పనితీరును దగ్గరగా తెలుసుకోవడం వల్ల భవిష్యత్తులో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించేందుకు అవసరమైన అవగాహన, అనుభవం పెంపొందుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జహీరుద్దీన్ తెలిపారు. విద్యార్థులు న్యాయ వ్యవస్థపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, రాజ్యాంగ విలువలు, న్యాయ సూత్రాల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఇలాంటి క్షేత్రస్థాయి సందర్శనలు న్యాయ విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్ మరియు సయ్యద్ మస్తాన్ బాషా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పేదల రేషన్ బియ్యంపై అక్రమ వ్యాపారుల కన్ను

కాశేపల్లి టోల్ గేట్ వద్ద 3,355 కిలోల బియ్యం పట్టివేత

ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో తనిఖీలు.. కేసు నమోదు చేసి దర్యాప్తు

పెద్దవడుగూరు, నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్న ఘటన పెద్దవడుగూరు మండలంలో వెలుగుచూసింది. అక్రమ రేషన్ బియ్యం రవాణాపై అందిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి భారీ మొత్తంలో బియ్యాన్ని పట్టుకున్నారు. కాశేపల్లి టోల్ గేట్ వద్ద నిర్వహించిన ఈ తనిఖీల్లో 3,355 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాఘవేంద్రప్పకు అందిన సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామునే అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం సుమారు 7 గంటల సమయంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి కాశేపల్లి టోల్ గేట్ వద్దకు చేరుకుని వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ వాహనాన్ని గుర్తించి నిలిపివేశారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా అందులో అక్రమంగా నిల్వ చేసి తరలిస్తున్న రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అధికారులు పరిశీలించగా మొత్తం 3,355 కిలోల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఈ వ్యవహారానికి సంబంధించి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై సంబంధిత శాఖలు నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం రవాణాకు పాల్పడే వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నూతన విద్యార్థులకు ఘన స్వాగతం..

విద్యార్థుల ఉత్సాహం మధ్య సందడిగా కార్యక్రమం

గుంతకల్, నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మ నూరు హరి విద్యార్థుల జీవితంలో కళాశాల దశ ఎంతో విలువైనదని, ఈ దశలోనే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని వక్తలు సూచించారు. గుంతకల్ పట్టణంలోని స్థానిక ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2026--27 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశించిన విద్యార్థులను ఆహ్వానిస్తూ శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులు, సీనియర్ విద్యార్థుల ఉత్సాహం, ఆనందోత్సాహాల మధ్య కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వజ్రకరూరు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గంగాధర్, విశిష్ట అతిథిగా విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ వి. కొండారెడ్డి విచ్చేసి విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. ముఖ్య అతిథి గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య ఒక కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. ఈ దశలో విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం, డిగ్రీ పట్టా పొందడం మాత్రమే విద్య లక్ష్యం కాదని, సమాజానికి ఉపయోగపడే జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడం కూడా ముఖ్యమని వివరించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు కలిగిన వారికే మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశిష్ట అతిథి డాక్టర్ వి. కొండారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర అధ్యయనం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థి దశలో అలవర్చుకున్న మంచి లక్షణాలు జీవితాంతం తోడ్పడతాయని





పేర్కొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మయ్య మాట్లాడుతూ.. నూతన విద్యార్థులకు కళాశాల కుటుంబం తరఫున స్వాగతం పలికారు. విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కష్టపడాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా కళాశాలలో విద్యాపరంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు. రసాయన శాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థిని షారున్ ఏంజెల్‌కు రూ.5,000 నగదు బహుమతిని కళాశాల విశ్రాంత రసాయన శాస్త్ర అధ్యాపకులు కురుపేంద్ర రెడ్డి అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి బహుమతులు ఎంతో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. కళాశాల వాతావరణం, విద్యా కార్యక్రమాలు, అధ్యాపకుల బోధన, అందుబాటులో ఉన్న అవకాశాలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ. రవిశంకర్ శర్మ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. హనుమంత రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్. నాగరాజు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. నారాయణ, సూపరింటెండెంట్ ఎం. వెంకటేశ్వర బాబు, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ సి. మాధవి, డబ్ల్యూ.ఈ.సి. కోఆర్డినేటర్ బి. వాణిశ్రీ, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పిన ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమం నూతన విద్యార్థులకు కళాశాల జీవితంపై మంచి అవగాహన కల్పించడంతో పాటు, సరికొత్త ఉత్సాహాన్ని అందించింది.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ గంజే నాగరాజు

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, స్వీట్లు తినిపించి ఘన సత్కారం..

గుంతకల్, నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను అనంతపురం జిల్లా నూతన జెడ్పీ చైర్మన్ గంజే నాగరాజు శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో జరిగిన భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది.

ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ గంజే నాగరాజు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు తినిపించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. తనకు అందించిన సహకారం, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రజలకు మరింత చేరువగా ఉంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని గంజే నాగరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకుల పరస్పర ఆత్మీయ పలకరింపులతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.



ఎన్నికల వేళ వైసీపీ అభ్యర్థులపై బెదిరింపులు, దౌర్జన్యాలు

టీడీపీ నాయకుల తీరుపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, వైసీపీ నేతలు

గుంతకల్లు, నవంబర్ 21 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటూ, టీడీపీ నాయకులు రౌడీ మూకలను ఉపయోగించి బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకొని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ శనివారం అనంతపురం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సమయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునే పరిస్థితులు కల్పించాలని, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన అవసరం ఉందని, ప్రతి అభ్యర్థికి పోటీ చేసే హక్కు, ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎలాంటి బెదిరింపులు, దౌర్జన్యాలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి వై. వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి, సింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే శైలజానాథ్, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కేతిరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుమల చరిత్రలో అతిపెద్ద కానుక - ఏకంగా 121 కిలోల బంగారు ఆభరణాలు

తిరుమల శ్రీవారికి ఓ భక్తుడు కనీవినీ ఎరుగని కానుక సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారంతో తయారు చేయించిన ఆభరణాలను ఏడుకొండల వాడికి సమర్పించనున్నారు.

తిరుమల శ్రీవారికి భక్తుడి భారీ కానుక

తిరుమల శ్రీవారికి ఓ భక్తుడు కనీవినీ ఎరుగని కానుక సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారంతో తయారు చేయించిన ఆభరణాలను ఏడుకొండల వాడికి సమర్పించనున్నారు. వీటి విలువ అక్షరాలా 150 నుంచి 160 కోట్ల రూపాయల వరకూ ఉంటుందని అంచనా. మొత్తం 9 సెట్లలో 45 రకాల ఆభరణాలను భక్తుడు ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈ నెల 26న తిరుమలలోని శ్రీవారి సన్నిధిలో ఆభరణాలను టీటీడీకి స్వయంగా అందజేయనున్నారు. తిరుమల చరిత్రలోనే వేంకటేశ్వరస్వామికి భక్తుల నుంచి అందుతున్న అతిపెద్ద కానుక ఇదేనని టీటీడీ వర్గాలు తెలిపాయి.



సైబరాబాద్‌కు ట్విన్ టవర్స్!

హైటెక్ హంగులతో 8 అంతస్తుల్లో నిర్మాణం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి

ఐటీ కార్యాలయాన్ని తలపించేలా డిజైన్లు చేయించారు. ట్విన్ టవర్ల తరహా కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలిచారు



ట్విన్ టవర్లలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిర్మాణానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఎనిమిది అడుగుల ఎత్తు, సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తర్ణంతో భవనాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.సీఎంసీ కార్యాలయ భవన నిర్మాణానికి అంచనా వ్యయం రూ.169 కోట్లు కాగా, ట్యాక్సులు పోనూ రూ.125.79 కోట్లను కాంట్రాక్టు వ్యయంగా అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో ఏదైనా స్పెషల్ క్లాస్ గుత్తేదారు సంస్థ పాల్గొనవచ్చని తెలిపారు. ఒప్పందం జరిగిన 12 నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. మాదాపూర్ హైటెక్స్‌లోని 4.1 ఎకరాల విస్తీర్ణంలో సీఎంసీ కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నారు.సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) ప్రస్తుతం హైటెక్స్ వద్దనున్న న్యాక్ బిల్డింగ్‌లో తాత్కాలికంగా కొనసాగుతోంది. పూర్తిస్థాయి కార్యాలయం ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీని తలపించే విధంగా ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల నేపథ్యంలో కమిషనర్ జి.సృజన డిజైన్లు తయారు చేయించారు.వేర్వేరు నమూనాల నుంచి రెండు టవర్లు, 8 అంతస్తుల్లో రూపుదిద్దుకున్న భవనానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదం తెలిపింది. బయటి వైపున కనిపించే అద్దాలు ముదురు కాఫీ రంగులో ఉండనున్నాయని తెలుస్తోంది. ప్రతి ఫ్లోర్‌కు అన్ని వైపుల నుంచి గాలి, వెలుతురు అందేవిధంగా డిజైన్ ఉంటుంది. ఖానామెట్‌లోని హైటెక్స్, సోమాటెల్ మధ్యలో ఆఫీస్ రాబోతుంది. దీని వెనుక చెరువు ఉంటుంది. ఓ టవర్ ఆరు అంతస్తుల్లో, మరో టవర్ 8 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టనున్నారు.

ఐటీ శాఖ మంత్రి పేరుతో భారీ మోసం

ఉద్యోగాల పేరు చెప్పి రూ.50 లక్షలు వసూలు

ఐటీ శాఖ మంత్రి ఓఎస్‌డీ అని నమ్మించారు

నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి రూ. 50 లక్షలు వసూలు చేశారు



ఐటీ శాఖ మంత్రి ఓఎస్‌డీ పేరుతో భారీ మోసం వెలుగు చూసింది. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నిందితులు పలువురిని నమ్మించారు. బాధితుల నుంచి రూ.50 లక్షల వరకు కాజేశారు. ఈ మేరకు ఐటీ మంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో నకిలీ ఓఎస్‌డీపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కేసులోని నిందితులు నకిలీ ఓఎస్‌డీ ఐడీ కార్డు, ప్రభుత్వ నియామక ఉత్తర్వులతో నిరుద్యోగులను మోసం చేశారు. ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టల్స్ సృష్టించి అభ్యర్థులను నమ్మించారు. టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నలుగురు బాధితులు, వారు అడిగినంత సొమ్మును అప్పగించారు. ఇలా వీరి నుంచి రూ.50.87 లక్షలు వసూలు చేశారు.డబ్బులిచ్చి కాలం గడుస్తున్నా నిందితుల నుంచి స్పందన కరువవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు మంత్రి కార్యాలయాన్ని సందర్శించారు. జరిగిన విషయాన్ని కార్యాలయంలో వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అనంతరం నకిలీ ఓఎస్‌డీపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ వెబ్‌సైట్లు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు.అయితే పోలీసుల విచారణ అనంతరం ఈ కేసులో ప్రధాన నిందితుడు హైదరాబాద్‌లోని రామంతపూర్‌కు చెందిన రవికిరణ్, మీ సేవ నిర్వాహకుడు గుంటూరు రవికుమార్‌లుగా గుర్తించారు. ఇదే తరహాలో 8 మందిని ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మోసం చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి ఐడీ కార్డ్స్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ పేరుతో ఉన్న కారు, పలు డాక్యుమెంట్లు, రూ.2.5 లక్షల నగదును సీజ్ చేశారు. కొలుగూరి రవికిరణ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించారు.

బతికున్న భార్యకు 'డెత్ సర్టిఫికేట్'

రూ.15 లక్షల ఆస్తి కోసం భర్త కన్నింగ్ ప్లాన్

నిజామాబాద్ జిల్లా భార్య పేరు మీద స్థలాన్ని విక్రయించేందుకు ఓ భర్త గుండెపోటుతో చనిపోయినట్లు ఫేక్ సర్టిఫికేట్ సృష్టించిన ఘటన చర్చనీయాంశంగా మారింది



ఆస్తులు, డబ్బుల పంపకాల్లో తేడాలు మనుషుల మధ్య బాంధవ్యాలను చెరిపేస్తున్నాయి. ఆవేశంలో బంధాలను కాలరాసి రక్తపాతం సృష్టిస్తున్నారు. అర్థం లేని కోపాలు, పంతాలతో కుటుంబ విలువల్ని మరిచిపోతున్నారు. ఇటీవల క్షణికావేశంలో అయిన వారిని దారుణంగా హతమార్చిన ఘటనలే అందుకు నిదర్శనం. కానీ ఓ భర్త మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. భార్య పేరిట ఉన్న ఆస్తిని దక్కించుకునేందుకు అతని కుట్ర చూసి పోలీసులే అవాక్కయ్యారు. సుపారీ గ్యాంగ్‌తో పనిలేకుండా, రక్తం చిందకుండా, అసలు ఆమె ఊపిరే ఆగిపోకుండా ఆమెను అంతమొందించాడు. చివరకు ఆమె తన అస్తిత్వాన్ని నిరూపించుకోవడానికి పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాల్సి వచ్చింది. అసలేం జరిగిందంటే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన దేశాయిపేట రవి. డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తుండే వాడు. కామారెడ్డి జిల్లా బీర్కూర్‌కు చెందిన గీతాంజలితో 2017లో వివాహమైంది. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా రవి దంపతులు కొన్నాళ్లు బీర్కూర్‌లో వేరు కాపురం పెట్టారు. పెళ్లైన కొన్నేళ్ల తర్వాత మనస్పర్థలు తలెత్తాయి. దీంతో గీతాంజలి పుట్టింట్లోనే ఉంటుంది. భార్యతో విభేదాల తర్వాత రవి సొంతూరి వచ్చి ఉంటున్నాడు. కోటార్మూర్ వద్ద భార్య గీతాంజలి పేరుపై ఉన్న 267 గజాల స్థలంపై రవి కన్నుపడింది. ఎలాగైనా దాన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. ఇప్పటికే తనకు దూరంగా ఉంటున్న భార్యకు ఈ విషయం చెబితే ఒప్పుకోదని రవి ఆ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు ఓ పథకం వేశాడు.డాక్యుమెంట్ రైటర్‌గా పని చేసిన రవి తన అనుభవాన్ని ఆసరాగా చేసుకుని భార్య 2018వ సంవత్సరంలో గుండెపోటుతో చనిపోయినట్లుగా ఫేక్ సర్టిఫికెట్ సృష్టించాడు. నకిలీ డెత్ సర్టిఫికెట్ ఆధారంగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సమక్షంలో భార్య చనిపోయినట్లు మరణ వాంగ్మూలంతో తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందాడు. ఆ తరువాత తన భార్య పేరుపై ఉన్న ప్లాట్‌ను తన తల్లి లక్ష్మీబాయి పేరిట గిఫ్ట్‌డీడ్ చేయించి ఆ స్థలాన్ని రూ.15 లక్షలకు మరొకరికి అమ్మేశాడు. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే రవి తన లాయర్ ద్వారా 2024 భార్య కాపురానికి రావడం లేదంటూ నోటీసులు పంపించడం ఇందులో మరో ట్విస్ట్.రవి అనే వ్యక్తి ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్. ఆర్మూల్ పెర్కిట్ గ్రామంలోనూ ఉంటున్నాడు. బీర్కూర్ గ్రామానికి చెందిన గీతాంజలిని 2017లో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. గీతాంజలి పుట్టింట్లోనే ఉంటోంది. భార్యతో విభేదాల తర్వాత రవి 2023లో సొంతూరి వచ్చి ఉంటున్నాడు. భార్య ఆస్తిపై కన్ను పడి 2018లో తన భార్య చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఆ తర్వాత ఆమె ఆస్తిని వేరొకరికి అమ్ముకున్నాడు'సీఐఐటీవల స్థలం విక్రయించినట్లు తెలుసుకున్న గీతాంజలి పోలీసులను ఆశ్రయించడంతో ఈ నకిలీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భార్య పేరుపై ఉన్న స్థలం అమ్మేందుకు నిందితుడు ఈ పని చేసినట్లు ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇక రవి ఆ నకిలీ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను ఉపయోగించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు విచారణలో తేలింది. ఇది గాక నిందితుడిపై మరో రెండు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.విభేదాల వల్ల భార్యతో దూరంగా ఉంటున్న రవి వాటికి పరిష్కారం గురించి ఆలోచించకుండా నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి భార్య ఆస్తిని కాజేయాలనుకున్నాడు. చివరకు జైలు పాలయ్యాడు. అసలు సమగ్ర విచారణ లేకుండా రెవెన్యూ అధికారులు ఇటువంటి నకిలీ పత్రాలు జారీ చేస్తున్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. కొందరు కమీషన్లకు ఆశపడి ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

బొమ్మల కంపెనీలో అగ్నిప్రమాదం

కోట్ల విలువైన ఎలక్ట్రికల్ టాయ్స్ దగ్ధం

విజయవాడ ఆటోనగర్‌లోని బొమ్మల కంపెనీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది

ఈ ప్రమాదంలో విదేశాలకు ఎగుమతి చేయాల్సిన కోట్లాది రూపాయల ఎలక్ట్రికల్ టాయ్స్ ప్రమాదంలో కాలిపోయాయి

విజయవాడ ఆటోనగర్‌లోని బొమ్మల కంపెనీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో విదేశాలకు ఎగుమతి చేయాల్సిన కోట్లాది రూపాయల ఎలక్ట్రికల్ టాయ్స్ ప్రమాదంలో కాలిపోయాయి. ఆటోనగర్ అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల విలువైన ఎలక్ట్రికల్ టాయ్స్ దగ్ధమైనట్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నుంచి విదేశాలకు నిర్వాహకులు పలురకాల ఎలక్ట్రికల్ టాయ్స్ ఎగుమతి చేస్తున్నారు."విజయవాడ ఆటోనగర్‌లో బొమ్మల కంపెనీలో ఈరోజు ఉదయం 10:30 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కోట్లాది రూపాయల ఎలక్ట్రికల్ టాయ్స్ ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదం ఎలా జరిగిందని ప్రస్తుతానికి తెలియలేదు. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఫైర్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో మంటలు పక్క భవనాలకు వ్యాపించలేదు. దీనివల్ల ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చేశాం. ఫిర్యాదులకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం." విజయవాడలోని ఆటోనగర్ నుంచి విదేశాలకు పలురకాల ఎలక్ట్రికల్ టాయ్స్ ఎగుమతి జరుగుతుంది. అమెరికా, చైనా, బ్యాంకాక్, దుబాయ్‌కు ఎగుమతులు చేస్తున్నారు. మాకు తెలిసిన సమాచారం ప్రకారం దాదాపు రూ. 6 కోట్ల వరకు నష్టం వచ్చిందని తెలుస్తోంది. ఫైర్, పోలీస్ సిబ్బంది చాలా కష్టపడి పనిచేశారు.

"ప్రాణాలు పోతున్నా బస్సు ఆపలేదు"

రోడ్డుపై గ్రామస్థుల బైఠాయింపు

దేవరాపల్లి మండలంలోని కాశీపురం గ్రామస్థులు ఆర్టీసీ బస్సులు నిలపడం లేదంటూ ప్రయాణికులు, గ్రామస్థులు ధర్నాకు దిగారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది



మనిషి ప్రాణం ఎప్పుడు ఎలా పోతుందో ఎవరూ ఊహించలేరు. అయితే గుండెపోటు వచ్చినప్పుడు గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్యం అందిస్తే బ్రతికే అవకాశాలుంటాయి. కానీ ఇలాంటి పరిస్థితిలో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతుంటారు. త్వరగా ఆస్పత్రికి తరలించాలని ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే పరిస్థితులు అనుకూలించకపోతే, సకాలంలో ఆస్పత్రికి చేరక ప్రాణాలు కోల్పోతారు. అలాంటి ఘటనే తాజాగా చోటు చేసుకుంది.అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కాశీపురం సమీపంలో సంజీవమెట్ట వద్ద ఓ రోగిని గురువారం విశాఖ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు 12డి నంబరు బస్సును ఆపారు. కానీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే వ్యక్తి గుండెపోటుతో మరణించాడని స్థానికులు ఆరోపించారు. ఆలస్యం కావడంతో సదరు వ్యక్తి మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీ బస్సులు నిలపడం లేదంటూ ప్రయాణికులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. దేవరాపల్లి నుంచి విశాఖపట్నం, అనకాపల్లితో పాటు ఇతర డిపోలకు చెందిన బస్సులను జంక్షన్‌లో నిలపాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్లు ఆదేశించినా డ్రైవర్లు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సమాచారం తెలుసుకున్న దేవరాపల్లి ఎస్ఐ సత్యనారాయణ అక్కడకు చేరుకున్నారు. వారితో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గొడవ జరిగిన ప్రాంతం వేపాడ మండల పరిధిలోనిది కావడంతో ఆ పోలీసు స్టేషన్‌కి సమాచారం అందించారు. అక్కడి పోలీసులు, దేవరాపల్లి ఎస్ఐ ఇరువర్గాల వారికి సర్దిచెప్పడంతో ఎట్టకేలకు వివాదం సద్దుమణిగింది. ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వారం క్రితమే జాబ్ - అమెరికాలో నల్గొండ యువకుడి మృతి

అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండ జిల్లాకు చెందిన సాయితేజ మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి



అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండ జిల్లా యువకుడు మృతి చెందాడు. దారికి అడ్డుగా వచ్చిన జింకను తప్పించే క్రమంలో తన వాహనాన్ని నిలిపే ప్రయత్నం చేయగా, వెనక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొట్టడంతో ప్రాణాలు విడిచాడు. ఇటీవల అమెరికాలో ఉద్యోగం సంపాదించిన కుమారుడు కుటుంబానికి అండగా నిలుస్తాడని కలలు కన్న తల్లిదండ్రులకు తీరని లోటు మిగిల్చాడు. చేతికందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.నల్గొండ జిల్లాలోని మునుగోడుకు చెందిన ఈరమళ్ల ప్రసాద్-శ్రీకన్య దంపతులు ప్రస్తుతం నల్గొండలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయితేజ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అయితే అతడు బుధవారం రాత్రి హైవేపై ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా జింక వచ్చింది. దీంతో సడన్ బ్రేక్ వేయగా, వాహనం జింకను ఢీకొట్టి నిలిచిపోయింది. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన సరకు రవాణా వ్యాను ఆగి ఉన్న సాయితేజ కారును బలంగా ఢీకొట్టింది. అనంతరం రోడ్డుపై నిలిచి ఉన్న సరకు రవాణా వ్యానును మరో రెండు వాహనాలు ఢీకొట్టాయి.ఈ ఘోర ప్రమాదంలో సాయితేజ అక్కడికక్కడే మృతి చెందగా, అదే కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రమాద సమయంలో సరకు రవాణా వ్యానును ఢీకొన్ని మరో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఇంకో ఇద్దరికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన సాయితేజ భౌతిక కాయం సోమవారం వరకు నల్గొండకు చేరుకునే అవకాశం ఉంది.ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సాయితేజ కష్టపడి చదివాడు. వారం రోజుల క్రితమే అక్కడ ఉద్యోగం సంపాదించాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఎంతో సంతోషించారు. ఇక కుమారుడి భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన కొద్ది రోజులకే సాయితేజను మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించింది. కన్న బిడ్డ ప్రయోజకుడయ్యాడని సంతోషించేలోపే, అతడు ఇక లేడన్న వార్త ఆ తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచెత్తింది.

విజయవాడలో గ్రిండర్ యాప్‌తో నయా దోపిడీ

కత్తితో బెదిరించి నగదు లూటీ

విజయవాడలో గ్రిండర్ డేటింగ్ యాప్ పేరుతో నయా దోపిడీ జరిగింది

హోమో సెక్సువల్స్ ఉపయోగించే ఈ యాప్ ద్వారా పరిచయం చేసుకుని

బాధితుడిని కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లారు.

గ్రిండర్ డేటింగ్ యాప్ పేరుతో దోపిడీ



విజయవాడలో ఈజీ మనీకి అలవాటుపడి సరికొత్త దోపిడీకి పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టైంది. గ్రిండర్ యాప్ ద్వారా యువకులతో పరిచయాలు పెంచుకొని ఆపై బ్లాక్‌మెయిల్ చేసి, దోపిడీకి పాల్పడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. హోమో సెక్సువల్స్ ఉపయోగించే ఈ యాప్ ద్వారా పరిచయం చేసుకుని ఇంటికి వచ్చిన షేక్ మున్నా, శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు బాధితుడిని కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లారు. ఈ కేసుకు సంబంధించి నిందితులు షేక్ మున్నా, మహంకాళి శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.ఈ కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంకకు చెందిన పాత నేరస్థుడు షేక్ మున్నాపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల అరెస్టు వివరాలను సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిశోర్ వెల్లడించారు. తనపై హత్య కేసులు ఉన్నాయని బాధితుడిని భయపెట్టి నిందితుడు షేక్ మున్నా డబ్బులు లాక్కెళ్లినట్లు ఏసీపీ వెల్లడించారు. బాధితుడు ఓ దశలో డబ్బులు లేవు అనడంతో తన చేతిని తానే కోసుకుని బాధితుడిని నిందితుడు భయపెట్టినట్లు ఏసీపీ దామోదర్ తెలిపారు.ఇటీవల గ్రిండర్ డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన వ్యక్తులను కొందరు పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు డిమాండ్ చేశారు.షేక్ మున్నా, శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు బాధితుడిని కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లారు. గ్రిండర్ యాప్ అనేది ఫ్రీగా అందుబాటులో ఉంది. మనీ యాప్ కూడా ఉంది. ఇది యూరప్ యాప్. హోమో సెక్సువల్‌కి అలావాటు పడిన వారు ఈ యాప్ ఉపయోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా కొందరు సెక్సువల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. మరి కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లలో పరిచయమైన అపరిచిత వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలని ఎట్టిపరిస్థితుల్లో పరిచితులతో పంచుకోవద్దని వివరించారు. మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

Editor, Published & Owned By:N RANGANATH & Printed at M/S Achukatla Publications, # 9/1542, M.R.Road, Gooty R.S., Gooty - 515402, Ananthapuramu District. Andhra Pradesh. Published at # 1-3,Gajarampalli Village & Post, Pamidi Mandal, Pamidi - 515775 Ananthapuramu District. Andhra Pradesh. E-Mail:editorranganath@gmail.com
Cell: 8466071258 P.R.G.I. Regd. No:APTEL/26/A8343